ఓంశ్రీసాయిరాం.

సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మమగుచు
మేటి వస్తువునందున మేటియగుచు
అంతటను సర్వసాక్షియైయలరునట్టి
ఆత్మయే బ్రహ్మ, బ్రహ్మయే ఆత్మయగును

వేదప్రమాణములు పురస్కరించుకొని భగవంతుడు అనేక నేత్రములతో, అనేక పాదములతో, అనేక శిరములతో, అనంతరూపుడై ప్రకాశిస్తున్నాడు. జీవత్వమును అనంతముతో హెచ్చించినప్పుడు ఇదే దైవత్వంగా మారుతుంది. జీవ X అనంత = భగవంతుడు. ఒక మానవత్వాన్ని అనేకత్వంతో హెచ్చించటముచేత ఇదే విరాట్స్వరూపుడని చెబుతూవచ్చింది వేదము. ఒక్క మానవమనస్సును అనంతముతో హెచ్చించటముచేత హిరణ్యగర్భుడు అనే దైవత్వంయొక్క మనస్సు తత్త్వంగా మారిపోతుంది.

వ్యక్తియందు విందిన ఆత్మ, దైవముయొక్క ఆత్మ రెండునూ ఒకటే అనే సత్యాన్ని నిరూపిస్తూవచ్చింది వేదము. ఏతావాతా ఈ రెండింటియొక్క అనురాగమును, ప్రతిబంధమును, సంబంధమును పురస్కరించుకొని వ్యక్తి, దైవము వేరు అని చెప్పటములో యేమాత్రము అర్థము లేదు. కనుక, వ్యక్తియొక్క అదృష్టాన్ని విశ్వసించే మానవుడు దైవత్వాన్నికూడను విశ్వసించక తప్పదు. దైవము లేదని చెప్పేవాడు తాను లేదని తాను చెప్పినట్లుగా ఉంటుంది. తాను ఉండినప్పుడు దైవము ఉండియే తీరాలి. నీడ మాత్రము ఉండి యదార్థము లేకపోవటమనేది వెఱ్ఱితనము. దైవత్వమనే బింబము ఉండినప్పుడే జీవత్వమనే ప్రతిబింబము జగత్తునందు ప్రకటిస్తూ వస్తుంది. ఏతావాతా దైవత్వముయొక్క అంశమే ఈ జీవత్వమనే బింబమై ఉన్నది.

మన దేహమందు ఏ భాగమునందు ఏ అంగములు ఏ పని చేయుచున్నవి, ఏ అంగమునందు ఏవిధమైన జీవము సంచరించుచున్నది మనకు ఏవిధముగా గోచరమగుచున్నదో, తన కాలి చిటికిన వేలుపైన చిన్న చీమ సంచరించుచున్నది తాను గుర్తించగలుగుచున్నాడు మానవుడు, అదేవిధముగా జగత్తు భగవంతునియొక్క అంగము కనుక జగత్తునందు ఏ మానవుడు ఎట్టి కర్మలు ఆచరిస్తున్నాడో, ఏవిధమైన బాధలతో ఉన్నాడో, ఏవిధమైన మనస్తత్వంతో ఉన్నాడో అనేది భగవంతుడు గుర్తిస్తునే ఉంటున్నాడు. మనము ఎవ్వరూ లేని ప్రదేశమని భావిస్తున్నామేగాని దైవము లేని ప్రదేశము జగత్తునందు కానరాదు. దైవము సర్వత్రా నిండినిబిడీకృతమైన దైవత్వాన్ని మానవుడు గుర్తించుకొనలేని అభీష్టముచేత దైవము లేదని తాను నిర్ణయము చేసుకుంటున్నాడు. 'అణోరణీయాన్ మహతో మహీయాన్'.

పంచభూతములందు ప్రధానమైనది గాలి. మన చుట్టూ ఉండినటువంటి సమయమందుకూడను మనకు గోచరించటము లేదు. తనకు కనిపించనంత మాత్రమున గాలి లేదని నిరూపించటము ఎంత వెఱ్ఱితనము. అట్టి గాలికంటే అణుస్వరూపుడైన దైవత్వము తనయందే, తన చుట్టూ, తన వెలుపల, తన ప్రక్కనకూడను ఉంటుండే దైవత్వాన్ని దీని రూపకంగా మనము నిరూపించగలము. కనుక, మానవుడు ఈ సత్యాన్ని గుర్తించి, ఏ ప్రదేశమునందైనా, ఏ కాలమందైనా, ఏ దేశమందైనా తాను పవిత్రమైన కర్మలు ఆచరించటానికి ప్రయత్నించాలి. మనము ఎట్టి కర్మలు ఆచరింతుమో అట్టి ఫలితములే మనకు లభిస్తాయి. మనము పాపపు పనులు చేయుచూ కేవలము ఇది దైవముయొక్క సంతోషమనిగాని, దైవముయొక్క ప్రేరణ అనిగాని మనము భావిస్తుంటాము. కాని, ఇది చాలా పొరపాటు. మన పాప పుణ్య కర్మలకు మనమే బాధ్యులముగాని దైవము కాదు. మానవత్వముయొక్క పోషణము పవిత్రమైన మార్గమునందు ప్రవేశపెట్టినప్పుడే ఈ దివ్యత్వమనే ఆత్మతత్త్వాన్ని అర్థంచేసుకోవటానికి వీలవుతుంది. చిన్న ఉదాహరణ. మనం అద్దమును చూచి నమస్కరిస్తే ఆ నమస్కారము తిరిగి మనకే వస్తుంది. ఆ అద్దముయొక్క ప్రతిబింబము ద్వారా. అదే అద్దమునందు ప్రతిబింబాన్ని వెక్కిరించితే తిరిగి ఆ ప్రతిబింబము వెక్కిరిస్తుంది. కనుక, మనం ఏది చేసినా మనకు అది ప్రతిబింబముగానే అది ఫలింపజేస్తూవస్తుంది. దీనినే సైన్సునందు newton's laws of motion అనికూడను చెప్పవచ్చును.

మనం ప్రకృతియందు ఉండే మానవులం కనుక మనం ప్రకృతియందు పవిత్రమైన కర్మలనే ఆచరించి పవిత్రమైన జీవితమును అనుభవించటానికి సాధ్యమైనంతవరకు ప్రయత్నించాలి. నిజముగా ప్రపంచమునందు ఏది గొప్పదని మనం విచారించాలి. నిజముగా నమ్మకము చాలా అవసరము. దైవమునందు నమ్మకము చేతనే మనం చేయవలసినదంతా సక్రమంగా చేయాలి.

ఇక్కడ మరికొన్ని రకములైన విరుద్ధములైన చర్యలు జరుగుతుంటాయి. మానవునికి అసత్యమార్గము ఇష్టముండదు. కాని అసత్యమాడుతున్నాడు. అన్యాయము చేయటము ఏమాత్రమూ ఇష్టముండదు. కాని అన్యాయము జరుగుతూనే ఉంటున్నది. అధర్మముగా ప్రవర్తించటానికి ఏమాత్రము ఆశించడు. కాని అధర్మాన్ని ఆచరిస్తున్నాడు. దీనికి ఏదో బలవత్తరమైన శక్తి తనను ప్రోద్బలపరుస్తుంటాది. అది ఏది? మానవునియందు మూడువిధములైన గుణములుంటున్నాయి. సత్త్వ, రజో, తమోగుణములు. అయితే ఈ రజోగుణ, తమోగుణములనేటువంటివి రెండూ మానవత్వాన్ని మరపింపజేసే దుష్టత్వంలో నిలుపుతూ ఉంటుంది.

అయితే ఈ రజోగుణ గర్భమందు మహాదుష్టుడైన కాముడు ఉద్భవించాడు. తమోగుణమునందు క్రోధ, ద్వేష, అసూయ, దంభములనే నలుగురు పుత్రులుకూడను జన్మించారు. అయితే వీటన్నింటికి కామము క్యాప్టెన్‌గా నిలిచాడు. ప్రతి దానికి ఈ కామమనేవాడు ముందంజ వేస్తున్నాడు. ఈ కాముడు ప్రతి మానవుని హృదయమందు చేరి అతనియందు దాచుకోవలసిన జ్ఞానరత్నమును అపహరిస్తున్నాడు. కనుక, ఈనాటి మానవునికి చేయరాదు అనుకున్న పనులుకూడను చేయటానికి కారణమేమిటి? చెప్పరాదు అనుకొన్న అసత్యమలు చెప్పటానికి కారణము ఏమిటి? అనుభవించరాదు అన్నటువంటి అధర్మమును అనుభవించటానికి కారణము ఏమిటి? ఈ కాముడే కారణము. ఈనాడు ఆశలకు అంతులేదు. బావిలో ఉన్నటువంటి నీరు పంపుతో కదుతుంటే ఏవిధంగా ఊటగా వస్తున్నాదో, ఆవిధముగా మానవునియొక్క కోరికలు ఒకటి నెరవేరిన తరువాత మరొకటి, మరొకటి ననెరవేరిన తరువాత మరొకటి జీవితమంతా కేవలం ఆశలయొక్క మూటగానే కనిపిస్తుంది. కనుక, జీవిమనేది దీర్ఘప్రయాణము. ఈ దీర్ఘప్రయాణమునందు ఈ కోరికలనే లగేజిని కొంతవరకు తగ్గించుకోవటానికి ప్రయత్నించాలి. దీనిని పురస్కరించుకొనియే రైల్వేవారు, less luggage more comfort, make tavel a pleasure అన్నారు. మనం ఈ కోరికలను తగ్గించుకోటానికి ఏమి చేయాలి? ఈ కోరికలకు అంతము లేదు. దీనికే భగవద్గీతయందు మహాసనము అనే పేరు పెదుతూవచ్చాడు కృష్ణుడు. అగ్నికి ఏవిధమైన ఆహుతి చేసినప్పటికీ అవి చాలు అని చెప్పదు. ఎంత వేసినప్పటికీ ఇంకా కావాలి, ఇంకా కావాలి అంటుంది. మరింత అభివృద్ధి అవుతుందేగాని ఈ అగ్ని చల్లారదు. దీనిని సంస్కృతమునందు అనలము అని పిలుస్తూ వచ్చారు. అలము అనగా చాలును. అనలము అంటే చాలదు అని. అనగా కామము అనలముతో చేరినటువంటిది. ఎన్నివిధములైన అనుభవములు అనుభవించినప్పటికీ, ఎన్ని కోరికలు తీరినప్పటికీ, ఇంకా కావాలి, ఇంకా కావాలి అనే అసంతృప్తిగానే తాను దానిని అనుభవిస్తుంటాది. రావణదు మీకు తెలుసు. ఎన్నివిధములైన సౌఖ్యములు తాను అనుభవించినప్పటికీ సంతృప్తి చెందక కట్టకడపటికి ఈ కోరికతోనే తన జీవితమును అంతముగావించుకున్నాడు. మహా భక్తుడుకూడా. 'ఓంనమశ్శివాయ, ఓంనమశ్శివాయ, ఓంమనశ్శివాయ'అని నిరంతరమూ స్మరించేవాడు. నమశ్శివాయ అనే నామము చెప్పినంతమాత్రమున భక్తుడగుతాడా? రామా అని చెప్పినంతమాత్రమున భక్తుడగుతాడా? లేక సాయిరామా అన్నంత మాత్రమున భక్తుడగుతాడా? కాదు, కాదు. అన్నము అనే పదమును వినుట, అన్నము ఆరగించుట ఈ రెండింటికీ ఎంత భేదమున్నదో అంత భేదమున్నది. అన్నము అనటానికి, అన్నము తినటానికి ఎంత భేదముంటున్నాదో అంత భేదముంటున్నాది. కనుక, రామా అని చెప్పటం అన్నం అని చెప్పటం. రామా అనుభవించటం అన్నం తినటం. మనం అన్నం భుజించాలిగాని అన్నం అని చెప్పినంత మాత్రమున ఆకలి తీరదు. కనుక, దైవాన్ని మనం అనుభవించాలిగాని దైవము పేరు చెప్పినంత మాత్రమున కాదు. man must realise god. see god, think god, talk god. this is true religion.

నిజమైన అనుభవముచేత మన నరనరములందుకూడను ప్రసరించి దేశమంతా వ్యాపించుతుంది. అన్నము తట్టలో పెడితే కంటికి మాత్రమే కనిపిస్తుంది. కాని, అన్నము పొట్టలో వేసినప్పుడు సర్వాంగములందు ప్రసరింపజేసి పుష్టినిస్తుంది. అదేవిధముగా దైవాన్ని అనుభవిస్తే దివ్యశక్తులన్నియూ బయలుదేరుతుంటాయి. మనము దైవాన్ని స్మరించనంత మాత్రమున ప్రయోజనము కాదు. దాన్ని అనుభవించాటికి ప్రయత్నించాలి. అయితే ఇట్టి అనుభవానికి కామమనే ఈ కోరికలము హతమార్చాలి. ఈ కోరికలను ఏవిధంగా కంట్రోలు చేయాలి? చీకటిని చూచి మనం చీకటితో ఎంత పోట్లాడినప్పటికీ, చీకటిని ఎంత నిందించినప్పటికీ చీకటి పోదు. ఆ చీకటి ఉన్న ప్రదేశమందు ఒక జ్యోతిని వెలిగిస్తే చాలు చీకటి పారిపోతుంది. అదేవిధముగా ఈ కామము అనే కోరికల చీకటి మన హదయమందు ప్రవేశించినప్పుడు జ్ఞానమనే జ్యోతిని వెలిగిస్తే ఆ చీకటి పోతుంది.

మన ఇంద్రియాలను నిగ్రహించటానికి ఆత్మజ్ఞానము కావాలి. నిజముగా మన ఇంద్రియములే ఇన్నివిధములైన అవాంతరములు పెడుతున్నాయి. చిన్న ఉదాహరణ. తెల్లవారి మేలుకొనినప్పుడు మనము సూర్యునికి విరుద్ధంగా ముఖము పెట్టుకొని నిల్చున్నప్పుడు మన నీడ చాలా అడుగులుగా ఉంటుంది. కాని, సూర్యుడు పెరుగుతూ, పెరుగుతూ వచ్చేటప్పటికి తన నీడ తరుగుతూ, తరుగుతూ వస్తుంది. కట్టకడపటికి ఈ సూర్యరశ్మి మన శిరస్సుపై పడేటప్పటికి మనయొక్క ప్రతిబింబముకూడా మన కాలి క్రింద పడిపోతుంది. అదేవిధముగా ఈ పెరిగిపోయిన కోరికలనే నీడను తగ్గించాలంటే మనము సూర్యుని వెలుగనే జ్ఞానమును అభివృద్ధిగావించుకున్నప్పుడు నీడ తగ్గిపోతుంది.

ఈ జ్ఞానము ఎలా సంపాదించాలి? తనకు తాను విచారణ సలపాలి. మన మనస్సు నిరంతరము పద్మవ్యూహమువంటి ప్రపంచమునందే సర్వకాలములందుకూడను సంచరిస్తుంటాది. దృశ్యకల్పితమైన జగత్తునలో సంచరించే మనస్సును అంతర్ముఖము గావించుకోవటానికి ప్రయత్నించాలి. చిన్న ఉదాహరణ. ప్రపంచములో ప్రతి పదార్థము నిప్పు, నీరు, గాలి, ఆకాశము, భూమి ఈ పంచభూతములతోనే కూడి వుంటున్నాది. మానవునియందుకూడను ఈ పంచభూతములు యిమిడి వుంటున్నాయి. అన్ని దేహములందును అవే చేరి ఉంటున్నాయి. తిరిగి ఈ పంచభూతములనే కోరతాడు. ఇది ఏమిటి? తనయందు ఏది ఉన్నదో దానినే

అమాయకత్వంతో కోరుతుంది ఈ మనస్సు. జగత్తంతయూ పంచభూతములతో కూడినది. ఈ పంచభూతములు నాతోనే ఉంటున్నవి అనే సత్యాన్ని చక్కగా నీ మనస్సుకు నచ్చ చెబితే, ఈ కోరికలకు ఏమాత్రమూ అవకాశముండదు. ఈవిధమైన పరిపూర్ణ పరిశీలన, విచారణ ద్వారా జ్ఞానమును అభివృద్ధి పరచుకోవాలి. జ్ఞానమనేది వేరుగా లభించేది కాదు. మానవుడు ఈనాడు చేయవలసినదేమనగా, సర్వభూతములందు వున్నటువంటి తన భూతమును, తన భూతమునందున్నటువంటి సర్వభూతములను ఏకత్వంగా భావించచటానికి ప్రయత్నము చేయాలి. మానవుని ఆశయములు వేరుగా ఉండవచ్చును, సిద్ధాంతములు వేరుగా ఉండవచ్చును, కర్మలు వేరుగా చేయవచ్చును, కార్యములు వేరుగా ఉండవచ్చును కాని, అన్నింటియందు ఉండిన దైవత్వము ఒక్కటే అనే సత్యాన్ని నిరూపించాలి. నా ముందు రెండు మైకులుంటున్నాయి. భగవంతము ముందు ఒక మైకు ఉంటున్నాది. ఈ బల్బులన్నీ వెలుతురు నందిస్తున్నాయి. ఈ బల్బు వేరు, ఆ బల్బు వేరు, ఈ మైకు వేరు, ఆ మైకు వేరుగా ఉంటున్నాయి. కాని, అన్నింటియందు ఉండినటువంటి కరెంటు ఒక్కటే అనే సత్యాన్ని గుర్తిస్తే ఇట్టి కోరికలకు అవకాశమే లేదు. కనుక, సర్వులయందు 'ఈశ్వరత్వము' అనేది ఒక్కటి ఉన్నదని నిరూపించటమే జ్ఞానము. ఈ జగత్తునందు శరీరము బాల్యము, యవ్వనము, కౌమారము, వార్ధక్యము అనే నాలుగు స్థాయిలు అనుభవిస్తున్నాది. ననాలుగు స్థాయిలుగా కనిపిస్తున్నాయేగాని అన్నింటియందు వ్యక్తి ఒక్కడే. ఈ అందచందములుగాని, ఆకర్షణవికర్షణలుగాని, వృద్ధబాల్యములుగాని ఈ మార్పులు జరిగిపోతున్నాయి. ఈవిధమైన యదార్థాన్ని మనము గుర్తించుకున్నప్పుడు ఈ దేహముగాని, ఈ ఆశలుగాని, ఈ ద్వేషములుగాని, అసూయలుగాని మనయందు ఆవిర్భవించటానికి అవకాశముండదు. ముఖ్యంగా మానవుడు ఉన్నత స్థాయిలో గౌరవించాలని కోరుతున్నాడు. అయితే మానవుడు మరి ఏమి ఆశిస్తున్నాడు? అందరూ తనను ప్రేమించాలని ఆశిస్తున్నాడు. గౌరవము ఏరీతిగా మనకు లభిస్తుంది? ధనము ఉన్నంత వరకు పరిచారకులు వచ్చి గౌరవించవచ్చు. ఈ గౌరవముకూడను కేవలము ధననిమిత్తమై గౌరవిస్తున్నారుగాని హృదయపూర్వకంగా గౌరవించటం లేదు. ధనము వచ్చినప్పుడు మందులు చిక్కవచ్చునుగాని ఆరోగ్యము చిక్కదు. ధనము వచ్చినప్పుడు పేరు చిక్కవచ్చునుగాని ప్రేమ చిక్కదు. ధనము వచ్చినప్పుడు సుఖములు చిక్కవచ్చుగాని శాంతి చిక్కదు. కాని, మనకు కావలసినది శాంతి. ఈ శాంతి అనేది మనకు ఎక్కడ లభిస్తుందంటే, ఒక్క దైవత్వమునుంచి తప్ప అన్యమార్గములో మనకు లభించదు.

ప్రతి మానవుడు అనేక సుఖములు ఉండినప్పటికీ, అనేక సదుపాయములు ఉండినప్పటికీ తాను శాంతి లేకుండా అలమటించిపోతున్నాడు. కనుకనే, ప్రతి మానవుడు శాంతిని ఆశించినప్పుడు దానికి తగిన కర్మను ఆచరించటానికి మనము సిద్ధంగా ఉండాలి. మానవుడు ఆకలిచేత పుట్టుకువస్తాడు. తక్షణమే తాను ఏడుస్తాడు. అంతోయింతో పాలో, తేనో అందించినప్పుడు ఏడుపు మానేస్తాడు. పుట్టిన తక్షణమే ఆకలి అనే ఆశతో పుడుతున్నాడు. సంవత్సరము వెళ్ళిన దగ్గరనుంచి ఆటవస్తువుల దగ్గరకు బయలుదేరుతాడు. ఆటవస్తువుల నుండి డ్రస్సులకు పరిగెడతాడు. తరువాత పుస్తకములు. తరువాత అధికారమునకు బయలుదేరుతున్నాడు. ఈ అధికారం నుంచి ఇంకా ఇంకా అధికారము ఆశిస్తున్నాడు. ఇవి ఏకాడికి అంత్యమయ్యే ఆశలు! ఈ గౌరవమనేది మనకు ఎప్పుడు లభిస్తుందంటే మనము చేయవలసిన పని చేయవలసిన సమయమునందు మన కర్తవ్యాన్ని లక్ష్యమునందుంచుకొని చేసినప్పుడే మనకు గౌరవము లభిస్తుంది.

చిన్న ఉదాహరణ. ఈనాటితో మన టీచర్స్ కాన్ఫరేన్సు ముగిసింది. రేపటినుండి మనం బయలుదేరిపోవాలి. రేపు బెంగుళూరు బస్సు ఎప్పుడని ఎన్క్వైర్ చేస్తాము. బెంగుళూరు బస్సు 9 గంటలకని చెబుతాడు. నీవు లగేజితో బస్‌స్టాండ్‌కి పోయి కూర్చున్నావు. 9గంటలైంది, పదిగంటలైంది, పదకొండు గంటలైంది కాని బస్సు రాలేదు. అపుడు నీకు ఒకవిధమైన విసుగు బయలుదేరుతుంది. సామాను అక్కడ పెట్టి మందిరం దగ్గరకు రావటానికి వీలుకాదు. లేక అక్కడనే బస్సుస్టాండ్‌లో కూర్చోటానికి సాధ్యము కాదు. మనస్సుకు విసుగు. దేనివలన విసుగెత్తింది? రావలసిన బస్సు సకాలంలో రాకపోవటంచేత నీకు విసుగెత్తింది. ఈ విసుగెత్తిన సమయంలో నీవేమి చేస్తావు? బస్సును తిడతావు, బస్సుడ్రైవరును తిడతావు, ట్రాన్సుపోర్టును తిడతావు, చివరకు గవర్నమెంటునుకూడా తిడతావు. బస్సు టైముకు రావటంలేదని నీవు దూషిస్తున్నావు. ఈ దూషణ దేనివల్ల జరిగింది? సకాలంలో రాకపోవటం వలన ఇంత అసహనము, ఇన్ని దూషణలకు ఆ బస్సు గురైంది. అదేవిధముగా మానవుడు సక్రమమైన పనులు సకాలంలో చేయకపోతే జగత్తు నిన్ను దూషిస్తుంది. నీవు సకాలములో కర్మను నిర్వర్తిస్తే జగత్తు నిన్ను గౌరవిస్తుంది. సకాలంలో బస్సు వస్తే నీవు ఎంత ఆనందిస్తావు! డ్రైవరుకు థాంక్స్ చెబుతావు. అదేవిధముగా మనము సకాలములో సక్రమమైన పనులను నిర్వర్తిస్తూవస్తే జగత్తంతా మనలను గౌరవిస్తుంది.

ఇంకొక ఉదాహరణ. కన్న కొడుకు ఒక కాలేజీలో చేరుచున్నాడు. కుమారరుడంటే తల్లికి చాలా ప్రీతి. వాడు పాసైతే తల్లి ఇంట్లో చక్కగా తీపి వండుతుంది. పిల్లవానికి తలంటి స్నానము చేయిస్తుంది. కొత్త బట్టలిస్తుంది. ఆనాడు తల్లి గొప్ప పండుగ చేస్తుంది. వాడిని గౌరవిస్తుంది. తన కుమారుడు రాత్రింబవలు కష్టపడి తన కర్తవ్యాన్ని నిర్వర్తించాడని ఎంతో ఆనందిస్తుంది. అదే

కుమారుడు ఫెయిలైతే తల్లికూడను నిందిస్తుంది. వాడికి ఆనాడు అన్నం పెట్టటంకూడను దండగ అంటుంది. కారణమేమిటి? తాను చేయవలసిన పనిని సక్రమంగా చేయలేదు. తన కర్తవ్యాన్ని నిర్వర్తించలేదు. కనుక, ఈనాడు ప్రపంచములో గౌరవింపబడాలంటే ప్రపంచమునకు, మనకు అందరికీ మేలుగావించే పనులు చేయాలి. మానవుడు మానవుడుగా జీవించి మానవుని ప్రవర్తనయందు కర్తవ్యాన్ని నిరూపించి దానిని గుర్తించటానికి ప్రయత్నించినప్పుడే మనము గౌరవింపబడతాము. ఈనాడు మానవుడు ఆకాశయానాన్ని నిరూపిస్తున్నాడేగాని మానవత్వాన్ని ప్రకటించటము లేదు. మనయొక్క మానవగుణములు ఈనాడు అభివృద్ధి చేసుకోవాలి. మీకందరికీ తెలుసు. లండనుకు పోతే ప్రతి పదార్థముయొక్క విలువ ఆకాశానికి పెరిగిపోయింది. పదార్థానికి విలువ ఎక్కువైపోయింది. కాని, మానవుని విలువ తగ్గిపోయింది. కనుక, మనము మానవుని విలువను పెంచుకున్నప్పుడే పదార్థము విలువ తగ్గిపోతుంది.

ఈనాడు బాలవికాస్ గురువులందరూ చేయవలసిన పని ఏమంటే ఈ పిల్లలకు మానవునియొక్క గుణములను, మానవత్వాన్ని అభివృద్ధిపరచుకొనే టీచింగ్స్ తయారుచేయాలి. కేవలం కొన్ని శ్లోకాలను నేర్పించటంతో మాత్రమే కర్తవ్యం ముగిసిందని భావించరాదు. కొన్ని డ్రామాలు వేయించినంత మాత్రమున మన పని ముగిసిందని భావించరాదు. మనము ఏమి చెబుతున్నామో వాటిని ఆచరణలో చూపించటానికి మనము తగిన ప్రయత్నము చేయాలి. నిత్యజీవితములో ఈ మానవత్వాన్ని ఈ బాలబాలికలకు అందించి భవిష్యత్ జీవితము చాలా పవిత్రముగావించాలి. క్రమక్రమేణా క్రమశిక్షణలో వారిని చక్కచేయటానికి ప్రయత్నించాలి. అపుడే అన్ని దేశముల భవిష్యత్తు చక్కని గుణపాఠాన్ని నేర్చుకొని ఓర్పు వహిస్తుంది. మానవత్వంలో ఉండిన విలువలు మనం ఈనాడు గుర్తింపచేయటానికి తగిన ప్రయత్నము చేయటమే కాకుండా మనముకూడను అలా జీవించటానికి తగిన ఆచరణకూడను ఉంటుండాలి. మొట్టమొదట కోరికలను తగ్గించుకోవాలి. ఇవి పిల్లలయందు క్రమక్రమేణా బలపరుస్తూ రావాలి. ఇపుడు పిల్లలంతా ఒకరి సామాను ఒకరు దొంగిలించటానికిగాని, ఒకరిపైన ఒకరు కోప్పడటనికిగాని, ఒకరినొకరు ద్వేషించుకోటానికిగాని కారణమేమిటి? ఈ పిచ్చి కోరికలే. దేని నిమిత్తమై చదువుకుంటున్నాము? మరియొక ఉదాహరణ.

ప్రవహించే నదులకంతా రిజర్వాయిర్ పెడుతుంటారు. దేనికోసము? ఈ నీటినంతా నిలువచేయటానికి కాదు. నిలువచేసి ఆ నిలువచేసిన దానిని కాలువల ద్వారా పంటలకు పెట్టించి, పంటల ద్వారా సుభిక్షాన్ని అభివృద్ధి పరుస్తారు. ఈ విద్యనంతనూ ప్రోగుచేసుకొని రిజర్వాయిర్ పెట్టుకున్నాము. ఈ విద్యనంతా క్రమక్రమేణా కెనాల్స్ ద్వారా సమాజము అనే పంటను పండించాలి. మనము నేర్చిన విద్యనంతనూ కేవలము మన తలలో పెట్టుకొని మనము దానిని లెక్కలు వ్రాసుకోవటమము కాదు. దీనిన సమాజములో ఉపయోగపెట్టి, సమాజమును అభివృద్ధి పరచి, సమాజమును సంస్కరింపజేసి తద్వారా పరిణామము తెప్పించటానికి ప్రయత్నించాలి. మనము అట్టి కర్మలు ఆచరించినప్పుడే మానవజన్మ సార్థకమౌవుతుంది. కర్మలే ఆచరింపక, నాకు తినటానకి, ఉండటానికి స్థలము అనుకూలంగా వుంటుండాదని సోమరిపోతుగా మనము తయారుకాకూడదు.

చిన్న ఉదాహరణ. మనము చేతికి రిష్టువాచి పెట్టుకుంటాము. నిత్యమూ కీ యిచ్చి అది సరిగా పనిచేస్తుంటే చక్కగా మనకు టైము చూపుతుంది. మనము దీనిని ఉపయోగపెట్టకుండా ఈ వాచ్ని బీరువాలో పెడితే అది ఆగిపోతుంది. ఉపయోగపెట్టకుండా పెడితే రస్ట్ పట్టి చెడిపోతుంది. జడమైన వస్తువు ఈవిధంగా చెడిపోతుంటే చైతన్యమైన ఈ దేహము సరియైన పని ఏమీ చేయకపోతే ఈ లోకము ఎంత రస్ట్ పట్టిపోతుంది. ఈ రస్ట్ ఏది? ఈ డిజైర్ అన్న రస్ట్ పట్టిపోతుంది. ఈ రస్ట్ పట్టటం వలన బరస్ట్ అయిపోతుంది. ఈ బరస్ట్ కాకమునుపే, రస్ట్ పట్టక మునుపే రెస్ట్ను మనం కోరాలి. అయితే ఈ రెస్ట్ కావాలనుకుంటే దానికి ముందుగా టెస్ట్ చేయాలి. ఏమి టెస్ట్? నేను మానవుడుగా జీవిస్తున్నానా? మృగముగా జీవిస్తున్నానా? అనే ప్రశ్న ఎవరికివారు వేసుకోవాలి. నా కర్తవ్యాన్ని నేను నిర్వర్తిస్తున్నానా లేదా అనే ప్రశ్న వేసుకోవాలి.

ధ్యానము, ధ్యానము అంటున్నాము. ఈనాడు మనము చూస్తున్నటువంటి ధ్యానము భాతీయ సంస్కృతికి విరుద్ధమైనది. చిన్న ఉదాహరణము.

సద్గుణంబు లేక సచ్చింతనలు లేక
ధ్యానమందు మనసు పూనగలదె
ఇల్లు కట్టుటకును యిటుకలు సున్నంబు
కలుగకున్న ఇల్లు కట్టుటెట్లు?

అదేవిధముగా మనకు ధ్యానము కుదరాలనుకుంటే సద్గుణంబులు, సచ్చింతన ఈ రెండుకూడను ఉంటేనే కుదురుతుంది. కాని, దురదృష్టవశాత్తు ఈనాడు ఎటువంటి క్వాలిటీస్ కూడను ఉండనక్కరలేదు. ఎటువంటి చెడ్డ క్వాలిటీస్ ఉండినప్పటికీ ఒక్క నిముషంలో ధ్యానం కుదిరిపోతున్నాది. ఇది నిజమైన ధ్యానమా? కాదు, కాదు. కృత్రిమ ధ్యానము. ఏ intoxicant వేసుకుంటే లేక ఏ opium వేసుకుంటే, ఏ డ్రింకో తీసుకుంటే అందరు నిద్రపోతుంటారు. కాదు, కాదు. ఈనాడు ధ్యానమునకు ఇన్ని పేర్లుంటున్నాయి.

కాని, అన్నీ మెడిటేషన్‌లు కావు.

మన ముందు అద్దము పెడితే మనకు ఏమి కనిపిస్తుంది? మన రూపము మనకు కనిపిస్తుంది. అద్దమునకు ఏమి పని? ఎదుట ఉన్న పదార్థమును నిరూపించటమే దాని గుణము. అదేవిధముగా మనము సద్గుణములు, సచ్చింతనలు అనే క్రియచేత చిత్తమనే అద్దాన్ని పరిశుద్ధము చేసినప్పుడే దైవత్వమనే ప్రతిబింబము చక్కగా కనిపిస్తుంది. నీవు ఏ పదార్థాన్ని నిరంతరమూ చింతనచేస్తూ, చేస్తూ, చేస్తూ పోతావో అదే పదార్థము నీకు ఆకారములో కనిపిస్తుంది. దీనినే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అన్నారు. నీలో ఎట్టి భావములో నీకు ప్రతిబింబించేటువంటి అట్టి భావములే వస్తుంటాయి. కనుక, నీవు నిరంతరమూ మంచి విషయాలను చింతిస్తూ రా. పుణ్యకర్మలు ఆచరిస్తూ రా. పరోపకారమనే కర్మను చేస్తూ రా. అదే నీకు నిరంతరముకూడను ప్రతిబింబిస్తూ వస్తుందాది. నీవు పవిత్రమైన భావములచేత నీ అపవిత్రమైన చింతనలను దూరముచేసుకుంటూ పో. మనము ధ్యానములో కూర్చున్నప్పుడు ఎక్కడెక్కడో పోయిన పదార్థములనంతా చింతిస్తూ రాకూడదు. ఈనాటి ధ్యానము కేవలము కూర్చొనేటువంటి చోటు మాత్రమే శుద్ధమైపోతున్నాది, అంతే. కూర్చున్న చోటునే కూర్చుంటాము మరువకుండా. ఇంతమాత్రమే కాదు. కూర్చోవటముకూడా కదలకుండా. ఒక దోమ వస్తే తపీమని కొడతాము. నీవు దోమను ధ్యానము చేస్తున్నావా లేక పరమాత్మను ధ్యానం చేస్తున్నావా? ముఖ్యంగా పరమాత్మను ధ్యానం చేస్తే ఈ మస్కిటో కనిపించకూడదే! కనుక, మన చిత్తము ఒక అద్దము వంటిది. మస్కిటోపైన మనస్సు పోయిందంటే ఆ మస్కిటోనే మన చిత్తములో వేసుకున్నామనమాట. దీనిని మరొకరీతిగా విచారణ చేయాలి. ధ్యానము అనేటువంటిది పవిత్రమైన స్మృతి. ఇది నీకు, భగవంతునకి తప్ప ఇంకెవరికీ సంబంధముండకూడదు. కొంతమంది ప్రక్కప్రక్కనే కూర్చొని ఒకరికొకరు తగులుతూ ధ్యానము చేస్తుంటారు. ఇది ధ్యానమునకు సరియైన పద్ధతి కాదు. ఏకాంతమైన ప్రదేశములో ధ్యానము చేయాలి. గుంపుగా ధ్యానము చేయటం వలన ప్రక్క వారు ఏమిచేస్తున్నారా, అతను చేస్తున్నాడో లేదో, ఈవిధమైన ప్రక్కవారి చింతనంతా పట్టించుకుంటారు. వారిని వీరు, వీరిని వారు చిత్తమందు ఉంచుకుంటున్నారు. ఈవిధమైనటువంటి ప్రక్కవారి చింతనంతా పట్టించుకుంటారు, వారిని వీరు, వీరిని వారు చిత్తమునందు ఉంచుకొంటున్నారు. ఈవిధమైన చిత్తముతో మనము ధ్యానము చేస్తున్నాము. ఇంతేకాదు. మనము ఎక్కడైనా గుంపులో కూర్చున్నప్పుడు ధ్యానము చేయకూడదు. ఈ ధ్యానము ఎగ్జిబిషన్ కాదు. నీవు పదిమందిలో పదిమందిగా ఉంటుండు. అపుడు నీవు పవిత్రమైన ధ్యానమునందు మనసు ప్రవేశపెట్టలేవు.

నీకు ధ్యానము చేయాలని ఆసక్తిగా ఉంటే, నీవు నేరుగా రూముకు వెళ్ళు. నీ తలుపు వేసుకో. ఏకాకివై కూర్చో. అక్కడ నీకు ఒక విధమైన దివ్యమైన వైబ్రేషన్స్ నీలో ప్రవేశిస్తాయి. పదిమందిలో నీవు ధ్యానము చేయటానికి కూర్చోటము కేవలము ఒక ఎగ్జిబిషన్‌గా ఉంటుంది. చులకనగా ఉంటుంది. తద్వారా మనయొక్క గౌరవముకూడను కొంవరకు సన్నగిల్లుతుంది. మెడిటేషన్ అనేది చాలా విలువైనది. ఒక డైమండ్ షాపుకు పోతే డైమండ్‌ను బయట పెట్టుకొని కూర్చోడు. నిన్ను ఒక్కడినే లోపలకు తీసుకువెళ్ళి ప్రత్యేకమైన ఒక అద్దములో పెట్టి నీకు దానిని వర్ణిస్తూవస్తాడు. అదేవిధముగా ఫిష్‌మార్కెట్ ఉంటుంది. ఆ ఫిష్‌లను బయట పెడతారు. ఈ మార్కెట్‌కు చాలామంది పోతుంటారు. కాని, డైమండ్ షాపుకు ఒకరో, ఇద్దరో వెడుతుంటారు. కనుక, మనం బయట కూర్చున్నామంటే మనం ఫిష్ మార్కెట్‌లో వుంటున్నాము. డైమండ్ మార్కెట్, దేనివలన ఫై-మైండ్. మెడిటేషన్ ద్వారా మైండ్‌ను స్థంభింపజేయాలి. మనస్సును స్థంభింపజేసేదే నిజమైన మెడిటేషన్. అయితే, ప్రారంభములో కొంతవరకు వేవరింగ్ కలిగిస్తుంది. అంతటితో నీవు విసుగు పడకూడదు. ఇంకా శ్రద్ధను అభివృద్ధిపరుస్తూ రావాలి. క్రమక్రమేణా ప్రేమను పెంచుకుంటూ పోవాలి.

ఇక్కడ మెడిటేషన్ అంటే మూడు పదార్థాలుంటున్నాయి. ఎవరు చేస్తున్నారో వారినే ధ్యాస అంటారు. ఎవరిని చేస్తున్నారు, దైవాన్ని చేస్తున్నారు, అచనినే ధ్యేయము అంటారు. ఏమి చేస్తున్నాడు, మెడిటేషన్ చేస్తున్నాడు. మెడిటేషన్, ధ్యాస, ధ్యానము మూడూ ఏకమైపోవాలి. నేను ధ్యానము చేస్తున్నానంటే నేను అనే భావము మరచిపోయేవరకు ధ్యానము చేయాలి. ఎందుకనగా 'నేను చేస్తున్నాను' అనేంతవరకు అది మెడిటేషన్ ఎట్లా అవుతుంది? ఈ 'నేను' మరచిపోవాలి. ఈ మెడిటేషన్‌లో దైవము వచ్చి చేరిపోవాలి. ధ్యానములో ధ్యేయము వచ్చి చేరిపోవాలి. ధ్యాస మరచిపోవాలి. అందువలనే, నేను ధ్యానము మూడు గంటలు, నాలుగు గంటలు చేస్తున్నాని గంటలు చెప్పినంత వరకు అది ధ్యానము కాదు. ధ్యానము ఎంతసేపు చేస్తున్నాను అనేది తెలియకుండా పోయినప్పుడు అది ధ్యానమౌతుంది. పూర్వం మహర్షులు సర్వసంగపరిత్యాగులై కేవలము ఆకులలములు తింటూ అరణ్యములలో ఎన్నియో శ్రమలకు గురియైపోయినారు. ఈనాడు కలియుగములో కృత్రిమ ధ్యానం వస్తుంటే, ఇంత సులభమార్గములో ఇది మనకు లభిస్తుందా? ఈ సులభంగా వచ్చేది సులభంగా పోతుంది. ఎంత త్వరగా వస్తుందో అంత త్వరగా పోతుంది. మనకు నిదానమై హృదయములో వ్రేళ్ళు దిగి హృదయాన్నంతా ఆవరింపజేయాలి. అది ధ్యానమంటే. చిన్న ఉదాహరణ. వంకాయచెట్టు, బెండకాయచెట్టు, బీన్సు ఇవన్నీ త్వరలోనే ఫలితాన్ని యిస్తున్నాయి. త్వరగానే వెళ్ళిపోతున్నాయి. మామిడి, కొబ్బరి, పనస చాలా నిదానంగా ఫలాల్నిస్తాయి. చాలా శాశ్వతంగా ఈ చెట్లు జీవిస్తాయి. అదేవిధముగా తాత్కాలికముగా, త్వరగా ధ్యానము చేయాలని ఎంత మనం వేస్ట్ చేస్తామో ఎంత

మన జీవితంలో వేస్ట్ అయిపోతుంది. కనుకనే, time waste is life waste. మనం నిదానంగా చేసినా ఫర్వాలేదు. మనము సరైన ధ్యానములో ప్రారంబినిచాలి. మనయొక్క జీవితము ఒక తేరువాకము చెట్టువలె తయారైంది. ఇలాంటి విశాలమైన చెట్టుని కేవలం పలుగు తీసుకొని కొడితే అది తెగుతుందా? దీనితో ఏమాత్రమూ కాదు. పలుగుకూడా పాడైపోతుంది. వైరాగ్యమనే ఉక్కు గొడ్డలిని తీసుకొని కొట్టాలి. అప్పుడే తగిన స్థితి వస్తుంది. మనము సుఖాన్ని త్యాగముచేయాలి. ఎందుకనగా ఈ దేహముయొక్క సుఖము కోసము మనము పాటుపడుతున్నాము. కాదు, కాదు. నిజమైన సుఖము మానవుని మనస్సుయొక్క సుఖం అని భావించాలి. ఎందుకంటే ఈ మైండ్ అనేది హార్స్, బాడీ ఒక కార్ట్. కార్ట్‌ను ముందు పెట్టి హార్స్‌ను వెనుక పెడితే ఏమైపోతుంది? మైండ్ అనే హార్స్‌ను ముందు పెట్టాలి. బాడీని వెనుక పెట్టాలి. ఏ రీతిగా పనిచేయటం. హెడ్డ్‌కి ఫుడ్ యివ్వాలి.

'నశ్రేయో యోగం వినా'. ప్రతి వ్యక్తికూడను ఒక లిమిట్‌లో ఉండాలి. మన కోరికలు కూడను అంతోయింతో ఉండాలి. కాని, మితిమీరినవిగా వుండకూడదు. దీనికొక చిన్న ఉదాహరణ. ధనము మనకు అవసరమే. అది లేకపోతే మన జీవితం వుండటానికి వీలు లేదు. అయితే అధికంగా ఉంటే ఒక్క క్షణమైనా శాంతి ఉండదు. లేకుండా ఉంటే మనము ఒక్క క్షణమైనా ఉండలేము. ఈ రెండూ కష్టమే. ఈ రెండింటినీ ఎట్లా తలుస్తున్నామంటే మనము తొడుక్కునే జోడుమాదిరి ఉంటున్నాది. జోడు మనకు తక్కువ సైజుగా ఉంటే మను కరచిపెడుతుంది. పెద్దవిగా ఉంటే ఇంటికి వెళ్ళేవరకు మనం నడవలేము. కనుక, సరిపోయే సైజుగా ఉండాలి. ధనముకూడా ఎక్కువగా ఉంటే మనము జీవించలేము. తక్కువగా ఉంటేకూడా జీవించలేము. మనం ధరించే చెప్పులు మాదరిగా సరిసమానంగా ఉండాలి. మన ధనము, మన గుణము, మన బలమునుకూడను వెదజల్లాలి. అప్పుడే జగత్తంతా చక్కగా సుక్షేమంగా ఉంటుంది. అదేవిధముగా మనం గడించిన చదువులుకూడా సమాజంలో వెదజల్లాలి. ఏవిధంగా? ఆచరణ రూపకంగా వెదజల్లాలి. టీచర్స్ అని చెప్పి పిల్లలకు చెప్పినంత మాత్రమున ప్రయోజనము లేదు. నీవు చెప్పేదానికంటే చేసి నిరూపించటంలో పిల్లలకు చాలా ప్రయోజనం కనిపిస్తుంది. నీవు చెప్పింది కేవలము నోటితో చెబితే వారుకూడా కేవలము నోటితోనే చెబుతారు. నీవు కేవలము అనుభవింపజేసుకుంటే తాను అనుభవించుకుంటాడు. కనుక, 'యద్భావం తద్భవతి' . మనము ప్రేమతో, కరుణతో, హృదయముతో ఒకవిధమైన వాత్సల్యముతో ఆ పిల్లలయొక్క భవిష్యత్‌కూడను మనం బోధించాలి. ఈ మానవత్వమును అభివృద్ధి పరచి మానవత్వానికి దివ్యత్వాన్ని చేర్చాలనే ప్రయత్నంతో మనం ప్రేమను అభివృద్ధిపరచుకోవాలి.

ఈ టీచర్సు నిరంతరం నవ్వుతూ, నవ్వుతూ పిల్లలను నవ్వించటానికి ప్రయత్నముచేస్తూ మీరు టీచ్ చేయటానికి పూనుకోవాలి. వారపైన విసుగుకోవటంగాని, లేక కోప్పడటంగాని చేయకూడదు. వారిని బెదిరించకూడదు. వారికి ప్రేమతో తగిన రీతిగా నచ్చచెప్పటానికి ప్రయత్నించాలి. 'నేను చెప్పినాను, నా డ్యూటీ అయిపోయింది' అని వెళ్ళిపోకూడదు. మనము చెప్పిన పాఠము వారికి అర్థమైందై లేదా అని మరియొక క్లాసు తీసుకొని వారికి చక్కగా యింకొక పర్యాయము చెప్పి తీరాలి. పది దినములైనా ఫర్వాలేదు, వారికి ఒకే పాఠాన్ని మీరు చెప్పండి. మీరు పది పాఠాలు పది రోజులలో చెప్పేసి నా పని అయిపోయిందంటే ఏమీ ప్రయోజమనం లేదు. చెప్పినదే మరల చెబుతూ రావాలి వారికి. వీరు చిన్న పిల్లలు, లేత హృదయులు. చెప్పినదే చెబుతున్నానని చెప్పి విసుగు తెచ్చుకోకూడదు. చెప్పినది వారు మరల అర్థం చేసుకొని చెప్పునట్లుగా మనం కృషిచేయాలి. మనము ఒకే ముఖమును నాల్గు పర్యాయములు కడుక్కుంటున్నాము. విసుగు చెందుచున్నామా? అదేవిధముగా చెప్పింది వారికి చెబుతూ రావాలి. అక్కడ మనకు ఈ కంపేరిజన్ సరిపోతుంది. శాంతి లభిస్తుంది. ఈ శాంతి మనము అభివృద్ధి చేసుకోవాలి. ఈ శాంతి ఉన్నప్పుడే సౌఖ్యము లభిస్తుంది. కనుక, మనం విసుగు పడకుండా, కోపము తప్పించుకోకుండా, పిల్లలయందు ప్రేమతో, వాత్సల్యముతో మనయొక్క బిడ్డల వలె మనం భావించుకోవాలి. దీనిని సరిగా అర్థం చేసుకోవాలంటే చిన్న ఉదాహరణ. నీకు ఒక కొడుకు ఉంటాడు. నీ బాలవికాస్‌లో ఇరవైమంది పిల్లలుంటున్నారు. 'నాకెంతమందమ్మా పిల్లలంటే మీరు 'ఒక్కడు' అని చెబుతారు. కాదు, కాదు. ఇది చాలా తప్పు. బాలవికాస్ టీచర్స్ ఆవిధంగా చెప్పకూడదు. 21 మంది నాబిడ్డలని చెప్పాలి. బాలవికాస్ పిల్లలు ఇరవైమంది, నీయొక్క బిడ్డ ఒక్కడు, మొత్తం ఇరవైఒక్కమంది. అప్పుడు మనకు గొప్పగా ఉంటుంది. నాకు ఒక్కడే బిడ్డ, నా స్టూడెంట్స్ ఇరవైమంది అంటే నీ కొడుకును ఒకవిధముగా వేరుచేయటం అవుతుంది. నీ కొడుకు, బాలవికాస్ పిల్లలు వేరుకాదు. ఇతను కామపుత్రుడు, వారు ప్రేమపుత్రులు. నీ కుమారునకు ఏ సుఖము, ఏ అభివృద్ధి, ఏ క్షేమము కావాలని కోరుతున్నావో అదే సుఖాన్ని, అదే అభివృద్ధిని, అదే క్షేమాన్ని ఆ పిల్లలకు కూడా కోరాలి. ఒకప్పుడు భోజరాజు అనే మహాచక్రవర్తి ఉండేవాడు. అతని దగ్గర పశులకాపరి ఉండేవాడు. ఈ భోజరాజు పశువుల వేయి ఉండేవి. ఈ పశులకాపరికి ఒక చిన్న దూడ ఉండేది. ఈ రాజుయొక్క వేయి పశువులను మేపటానికి తీసుకుపోయేటప్పుడు దారిలో వీనియొక్క దూడనుకూడా తీసుకుపోయేవాడు. అక్కడ పశువులంతే మేస్తుంటే ఈ పశువులకాపరియొక్క స్నేహితుడు ఒకడు వచ్చాడు. 'ఏమిటాయ్యా! ఇన్ని పశువులు ఎవరివి' అడిగాడు. అపుడు వీడు చెప్పాడు, 'రాజువి నావి కలసి 1001' అన్నాడీ. ఈ 1001 ఏని విడదీయకుంటే వానికి ఎంత గౌరవము! వెయ్యి వేరుచేసి వాని దూడను వేరుచేసిన ఈ గౌరవము పోతుంది. కనుక, నీ కొడుకు

వేరు, పిల్లలు ఇరవైమంది వేరు అని చెబుతే మన గౌరవము పోతుంది. కాదు, బాలవికాస్ పిల్లలు, నా పిల్లలు అందరూచేరి 21మంది అంటే ఎంత గౌరవము లభిస్తుంది!

ఈవిధమైన సమత్వాన్ని బాలవికాస్ అధ్యాపకులు తెలుసుకోవాలి. అపుడే ఆ బాలవికాస్ పిల్లలకు తల్లికంటే మీపై ఎక్కువ ప్రేమ ఉంటుంది. మీరంతా విదేశాలనుండి వచ్చారు. ఇంకొక చిన్న ఉదాహరణ చెబుతాను. మన బాలవికాస్‌కు వచ్చే పిల్లలంతా మనం టీచర్లమని తమయొక్క తల్లిదండ్రులంతాకూడను ఇంట్లో ఉన్నారని ఒక భావం పిల్లలో ఏర్పడుతుంది. ఎప్పుడు బాలవికాస్ విడిచిపెడదామా, తల్లదండ్రుల దగ్గరికి పరుగెత్తి పోదామా అని ప్రయత్నం చేస్తారు. దేనివల్ల? తల్లియొక్క ప్రేమ వలన వారు అట్లు చేస్తారు. వీరి మనసు వారి ఇంటిపైపు లాగటానికి కారణమేమిటి? తల్లి ప్రేమే కారణం. కనుక, మనం బాలవికాస్ టీచర్స్‌గా వుండేవారము, తల్ల ప్రేమకంటే ఎక్కువ ప్రేమను మనం చూపుతే వీరు తల్లి దగ్గరకు పోరు. మన దగ్గరకే వస్తారు. నాలుగు అంగుళముల లైను ఒకటుంది. ఆ నాలుగుంగుళముల లైనను చిన్నది చేయాలంటే అది తుడిచిపెట్టనక్కరలేదు. దానిక్రింద ఎనిమిది అంగుళముల గీత పెడితే నాలుగుంగుళముల లైను చిన్నదైపోతుంది. కనుక, తల్లి ప్రేమ నాలుగుంగుళముల లైను, మన ప్రేమ ఎనిమిదంగుళముల లైనుగా పోయుంటే తల్లిప్రేమకంటే ఎక్కువగా ఉండుటచే ఎప్పుడునూ మీ దగ్గరనే ఉంటుంటారు ఆ పిల్లలు. ఈ ప్రేమను మనం పెంచినప్పుడే ఇప్పుడు ప్రపంచములో ఏర్పడిన అశాంతి, అక్రమ, అనాచారము, అసత్యము తుడిచివేయటానికి వీలవుతుంది. కాని, మనము కొంచెము స్వార్థముగా ప్రేమిస్తూపోతే ఈ అశాంతి ఏమాత్రముకూడను తరిగిపోవటానికి వీలులేదు. కనుక, మనం ఎంత అశాంతి పెరిగిందో అంత ప్రేమ మనం పెంచాలి. ఈ జగత్తులో అశాంతి అరికట్టటానికి ఎవ్వరి తరమూకాదు. ఒక్క దైవసంకల్పముచేత తప్ప.

కనుక, మీరందరూ దివ్యమైన భావముచేత, దివ్యమైన ప్రేమచేత, దివ్యమైన ఉద్దేశ్యముచేత మీరు ఇందులో పాల్గొన్నారు కనుక అవి మీరు విన్నవి ఆచరణలో పెట్టుటవలన మీ ద్వారానే ఈ దేశమంతా బాగుపడాలని నేను ఆశిస్తున్నాను.